జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 26-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 710 పేజీలు: 4 వెల : రూ.7

# మధురంగా..




# రూల్స్ బ్రేక్..!




* బడా హోటళ్ల 'ధన మదం'! * నిషేధిత ప్లాస్టిక్ వాడుతూ అడ్డంగా దొరికినా తగ్గని గర్వం! * 'మీడియా మా జేబులో.. వ్యవస్థ మా చేతుల్లో'.. అంటూ అహంకారం * మెరుపు దాడులు చేసిన నగరపాలక సంస్థ అధికారులు * రూ.8,500 జరిమానాతో సరిపెట్టిన అధికారులు * లక్షల్లో టర్నోవర్ చేసే మాకు ఇదే లెక్క అంటూ మధురం యాజమాన్యం బరితెగింపు వ్యాఖ్యలు! * ధన బలంతో చట్టాన్ని అపహాస్యం చేస్తున్న పలు హెూటళ్ల యాజమాన్యం * ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులోని 'ఆ ప్రముఖ హోటల్'లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకాలు * పెద్ద హోటళ్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు * వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో? * 'జీవీఎంసీ' తరహాలో ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంలో విఫలం

**శ్రీకాకుళం, జూన్ 25 (వార్త):** నగర పర్యావరణాన్ని కాపాడేందుకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపట్టిన ప్లాస్టిక్ వ్యతిరేక సమరంలో బడా బాబుల అసలు రంగు బయటపడింది. కమిషనర్ ఆదేశాలతో సీపాన నాయుడుపేట సచివాలయ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిర్వహించిన మెరుపు దాడుల్లో నిబంధనలను తుంగలో తొక్కి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపార సంస్థలను గుర్తించి రూ.8,500 జరిమానా విధించడంతో పాటు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో చిన్న వ్యాపారులు సహకరిస్తుంటే, లక్షల్లో సంపాదిస్తున్న బడా హోటళ్లు మాత్రం చట్టాన్ని అపహాస్యం చేస్తూ బరితెగించడం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ తనిఖీల్లో నగరంలో 'మధురం హోటల్'లో యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వాడుతూ పట్టుబడటంతో అధికారులు జరిమానా విధించారు. కేవలం ఒక ప్లేట్ ఇడ్లీని రూ.50 చొప్పున అమ్ముతూ రోజుకు వేలల్లో లాభాలు ఆర్జించే ఇటువంటి సంస్థలకు ఈ జరిమానా ఒక లెక్కలోనిది కాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "మాకు మీడియా మేనేజ్‌మెంట్ తెలుసు, డబ్బుతో వ్యవస్థలను కొనేయగలం, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ సదరు హోటల్ యాజమాన్యం ప్రదర్శిస్తున్న అహంకార ధోరణి స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. వారు చెప్పినట్లుగానే వాళ్లపై జరిమానా విధించిన కథనం ఒక్క పత్రికలో కూడా ప్రచురితం కాలేదు. చట్టం ముందు అందరూ సమానమే అయినప్పుడు, ధనబలంతో మున్సిపల్ నిబంధనలనే బేఖాతరు చేస్తున్న ఇలాంటి బడా వ్యాపారులపై కేవలం జరిమానాలతో సరిపెట్టడం ఎంతవరకు న్యాయమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న ఒక ప్రముఖ హోటల్‌లో కూడా అధికారుల కళ్లు గప్పి, గుట్టుచప్పుడు కాకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నట్లు పక్కా సమాచారం అందుతోంది. చిన్నపాటి టిఫిన్ బండ్లపై, పేద వ్యాపారులపై ప్రతాపం చూపే శానిటరీ సిబ్బంది.. బ్రాండెడ్ బోర్డులు తగిలించుకుని పర్యావరణాన్ని విషపూరితం చేస్తున్న ఇలాంటి పెద్ద హోటళ్ల వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇక్కడ కూడా సదరు యాజమాన్యాల 'ధన ప్రవాహం' అధికారుల కళ్లకు గంతలు కడుతోందా లేక రాజకీయ ఒత్తిళ్లు పనిచేస్తున్నాయా అనే కోణంలో అనుమానాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. కేవలం గడువు ముగిసిన ట్రేడ్ లైసెన్సులను పునరుద్ధరించి వదిలేస్తే ఈ బడా బాబుల ఆటలు సాగవు. అధికార యంత్రాంగం ఇకనైనా ఉక్కుపాదం మోపాల్సిందే. పక్కనే ఉన్న విశాఖ జీవీఎంసీ తరహాలోనే శ్రీకాకుళంలో కూడా తప్పు పదే పదే పునరావృతం చేసే మధురం లాంటి హోటళ్ల 'ట్రేడ్ లైసెన్స్'ను శాశ్వతంగా రద్దు చేసి, దుకాణాలను సీజ్ చేయడమే ఏకైక మార్గం. అప్పుడే వ్యవస్థలను కొనేయగలమనే అహంకారంతో ఊగిపోయే బడా వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ఏదేమైనా, చట్టాలు కేవలం సామాన్యులకేనా.. బడా బాబులకు వర్తించవా? అనే ప్రశ్నలకు శ్రీకాకుళం మున్సిపల్ అధికార యంత్రాంగమే తమ చర్యల ద్వారా సమాధానం చెప్పాల్సి ఉంది. కేవలం వేలల్లో జరిమానాలు విధించి చేతులు దులిపేసుకుంటే 'మధురం' లాంటి హోటళ్ల అహంకారానికి, ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులోని సదరు ప్రముఖ హోటల్ బరితెగింపునకు అడ్డుకట్ట వేయడం



అసాధ్యం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ధనబలంతో పర్యావరణాన్ని విషపూరితం చేస్తున్న ఇలాంటి పెద్ద తినుబండారాల కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ట్రేడ్ లైసెన్సులను రద్దు చేసే దిశగా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే శ్రీకాకుళం నగరం నిజమైన ప్లాస్టిక్ రహిత నగరంగా మారుతుంది. లేనిపక్షంలో, అధికారుల అలసత్వాన్ని, సదరు బడా హోటళ్ల ప్లాస్టిక్ భాగోతాన్ని ఆధారాలతో సహా త్వరలోనే నడిరోడ్డుపై నిలబెడతాం.

**(ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు హోటల్ ప్లాస్టిక్ భాగోతంపై.. త్వరలోనే ఆధారాలతో సంచలన వార్త)**

# సిలిండర్‌ను.. వదల్లేదు!

* బాలిగాం కాలనీలో దొంగతనం * బంగారం, వెండి, నగదు చోరీ * వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న బాలిగాం ప్రజలు



**మందస, జూన్ 25(వార్త):** మందస మండలంలోని బాలిగాం ఇటీవల దొంగతనాలు జరగడం సాధారణంగా మారింది. బాలిగాం కాలనీలో బుధవారం రాత్రి మూడు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. దొంగలు పక్కాగా రెక్కీ నిర్వహించి, చోరీకి పాల్పడ్డారు. బొంగి మమత ఇంటిలో ఎవరూ లేకపోవడంతో దొంగలు గేటు దూకి, లోపలకు వెళ్లి.. ఇంటి తలుపు తాళం పగులగొట్టారు. ఇంటిలోని తులంపావు బంగారం, ఆరు తులాల వెండికప్పులు, పట్టీలు, దీపం కుద్దులు, రూ.8,200లు నగదు చోరీ చేశారు. మరో ఇంటి తలుపు తాళం పగలగొట్టడానికి దొంగలు ప్రయత్నాలు చేయగా.. ఫలించలేదు. ఇంకో ఇంటిలో ద్విచక్రవాహనాన్ని ఎత్తుకుపోయారు. గ్యాస్ సిలిండర్‌ను కూడా విడిచిపెట్టలేదు. దొంగతనానికి



ఉపయోగించే ఓ గునపాన్ని దొంగలు హడావుడిలో సంఘటనాస్థలంలోనే విడిచిపెట్టి, వెళ్లిపోయారు. బాలిగాం కాలనీలో ఓ వివాహ వేడుక జరుగుతుండడంతో డీజే శబ్ధాలకు దొంగలు తలుపులు పగలగొడుతున్న శబ్ధాలు స్థానికులకు వినిపించలేదు. కాగా.. బాలిగాంకాలనీ దొంగతనంపై బాధితురాలు బొంగి మమత మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితమే బాలిగాం గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇదిలా ఉండగా మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బాలిగాం కాలనీలో జరిగిన దొంగతనంపై దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం చేరుకుని, వివరాలు సేకరించింది. బాలిగాం ప్రాంతంలో జరుగుతున్న దొంగతనాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## క్రైం వార్తలు

### కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



**పాతపట్నం, జూన్ 25 (వార్త):** పాతపట్నం మండల కేంద్రంలోని అచ్యుతాపురం ప్రధాన వీధిలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు రెండు గంటల సమయంలో అడవి నుంచి జనావాసాల్లోకి వచ్చిన ఒక చుక్కల దుప్పిపై వీధి కుక్కలు గుంపులుగా ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. గురువారం ఉదయం స్థానిక ప్రజలు వీధిలో మృతి చెంది ఉన్న చుక్కల దుప్పిని చూసి వెంటనే పాతపట్నం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ చుక్కల దుప్పి మృతదేహాన్ని పాతపట్నం అటవీ శాఖ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం పశువైద్యాధికారుల సమక్షంలో ఆ దుప్పికి పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేశారు.

### కాశీబుగ్గలో బాలుడిపై కుక్కల దాడి

**పలాస, జూన్25(వార్త):** కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండగా, గురువారం పదేళ్ల బాలుడు మడ్డు రోహన్‌పై కుక్కలు దాడి చేసిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కాలనీలో ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా బాలుడిపై వీధి కుక్కలు దాడి చేయడంతో అతడు తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు. స్థానికులు వెంటనే స్పందించి కుక్కలను తరిమివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కాలనీవాసులు మున్సిపల్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగినా, వాటి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

# డ్రోన్ సర్వేలెన్స్‌తో విస్తృత తనిఖీలు

* ఓపెన్ డ్రింకింగ్‌పై ముగ్గురిపై కేసులు నమోదు



**పాతపట్నం, జూన్ 25 (వార్త):** పాతపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గంజాయి వినియోగం, అక్రమ రవాణా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులపై గుర్తించి ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుసూదన్ హెచ్చరించారు. డ్రోన్ సర్వేలెన్స్‌తో పాటు ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# గ్రానైట్ క్వారీలో ప్రమాదం

* రాయి కింద పడి ఒడిశాకు చెందిన కార్మికుడు మృతి * చిన్న గుజ్జివాడలో ఘటన



**సారవకోట, జూన్ 25 (వార్త):** సారవకోట మండలం చిన్న గుజ్జివాడ గ్రామంలోని ఓ గ్రానైట్ క్వారీలో బుధవారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. క్వారీలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన శ్రీకాంత్ రెడ్డి అనే కార్మికుడుపై గ్రానైట్ రాయి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం, శ్రీకాంత్ రెడ్డి రోజువారీ పనులు ముగించుకుని విశ్రాంతి కోసం క్వారీలో ఉన్న ఒక పెద్ద గ్రానైట్ రాయి కింద కూర్చున్నాడు. అదే సమయంలో ఆ రాయి అకస్మాత్తుగా అతనిపై పడటంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, సహచర కార్మికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది, భద్రతా లోపాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీకాకుళం

# మాదక ద్రవ్య రహిత సమాజానికి యువత కృషి చేయాలి

### - జూనియర్ సివిల్ జడ్జి మాధురి




**పలాస, జూన్ 25 (వార్త):** మాదక ద్రవ్య రహిత సమాజానికి యువత కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలపై మాదకద్రవ్య వాడకం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పలాస కోర్టు ఆవరణలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలాస మండల సేవా సంఘం అధ్యక్షులు, పలాస కోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ కూడా వైద్యుని సలహా లేకుండా ఎటువంటి మందులు వాడరాదని, కొన్ని మందులను నిషేధించబడి ఉంటాయని, వాటిని అస్సలు వాడరాదని, అదే విధంగా మత్తు పదార్థాలను కూడా స్వీకరించడం ప్రతి ఒక్కరూ మానుకోవాలని కోరారు. ఆల్కహాల్ లేదా తదితర సంబంధిత పదార్థాలను ఎవరూ కూడా స్వీకరించరాదని తెలియజేశారు. ఇటువంటి మత్తు పదార్థాలను తీసుకున్నవారు నేరాలు ఎక్కువగా చేసే అవకాశం ఉందని, ప్రతి కుటుంబంలో కూడా మత్తు పదార్థాలు, నిషేధించబడిన గంజాయి, సిగరెట్, పొగాకు, ఆల్కహాల్ వంటి పదార్థాలను పెద్దలు కూడా మానుకుంటేనే వారి పిల్లల భవిష్యత్తు బాగుంటుందని, పెద్దలు తప్పు దారిలో వెళితే అది చూసి పిల్లలు కూడా అటువంటి చెడు వ్యసనాలకు అలవాటు పడతారని, కనుక ప్రతి కుటుంబంలో కూడా ప్రతి ఒక్కరూ కూడా మంచి వాతావరణంలో కల్పించి వారి పిల్లలను మంచివారిగా తయారు చేసి సమాజానికి కూడా మంచి యువతను, మంచి భవిష్యత్తును అందించాలని ఆమె తెలియజేశారు. మత్తు పదార్థాలకు అక్రమ రవాణా చేసే వారికి కూడా కోర్టుల ద్వారా చాలా ఘటన శిక్షలు అమలులో ఉన్నాయని, ఎవరూ కూడా మత్తు పదార్థాలను కలిగి ఉండరాదని, మత్తు పదార్థాలను రవాణా చేయరాదని, మత్తు పదార్థాలు కొనరాదని, వాడరాదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ప్యానల్ న్యాయవాదుల ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ఎటువంటి మత్తుకు లోనుకామని, మత్తు పదార్థాలకి దూరంగా ఉండి, శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండి మాదక ద్రవ్యరహిత సమాజానికి యువతగా సహకరిస్తామని, విద్యార్థినీ..విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు హనుమంతు సుధారాణి, జి.ఎం. ఎస్.అనిల్‌రాజు, ఏజీపీ పిండి వెంకట్రావు, సీనియర్ న్యాయ వాది బి.రవికుమార్ పట్నాయక్, డాక్టర్ కె.లోకేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ..విద్యార్థులు పాల్గొన్నారు.



## అడ్మిషన్ ఫీజు రద్దు చేయాలి




**పలాస, జూన్ 25 (వార్త):** పలాస జూనియర్ కాలేజ్ వద్ద ఏఐఎస్ఎఫ్, పిడిఎసు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పిడిఎసు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవికుమార్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జూనియర్ కళాశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల దగ్గర అడ్మిషన్ ఫీజు పేరుతో వసూలు చేయడం సరికాదన్నారు. 2000 నుండి 3000 వరకు అడ్మిషన్ ఫీజు కట్టలేక చాలామంది డ్రాపోర్ట్స్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ ఫీజు రద్దుచేసి ఇప్పటికే వసూలు చేసిన అడ్మిషన్ ఫీజును తిరిగి విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు స్వీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనం




**పలాస, జూన్ 25 (వార్త):** మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం సర్వ నాశనమని వక్తలు తెలిపారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాలలో "నశాముక్త భారత్ అభియాన్" కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ నరసింహులు మూర్తి సమన్వయంతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి పలాస జూనియర్ సివిల్ కోర్టు సీనియర్ అడ్వకేట్ సుధారాణి, బి. రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించడంతో పాటు, మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించి అమలులో ఉన్న చట్టాలు, వాటి ఉల్లంఘనపై తీసుకునే క్రమశిక్షణా చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలైతే వారి విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాడపోలమ్మకు విరాళం



**పలాస, జూన్ 25 (వార్త):** కిస్టుపురంలో వెలిసిన గ్రామ దేవత బాడపోలమ్మ గుడికి, విగ్రహానికి రంగులు వేయటానికి పెదంచలకి చెందిన టిడిపి నాయకుడు పోలాకి పాపారావు ముందుకొచ్చి విరాళం అందించారు. వారికి వారి కుటుంబానికి ఆ బాడపోలమ్మ చల్లని ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ "బాడపోలమ్మ అమ్మవారికి మా కుటుంబం తరపున సాదర విరాళం సమర్పిస్తున్నామని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుఖశాంతులతో, సమృద్ధిగా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు." గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడుద్దిస్తున్న ప్రియ మిత్రుడు శ్రీశయన రాష్ట్ర సభ్యుడు బూర్ల కృష్ణంరాజు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కృష్ణంరాజు నాయకత్వంలో గ్రామ అభివృద్ధి చెందాలని మనసారా కోరుకుంటూ గ్రామ దేవతను ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మురుగు నీరు నిల్వ.

**జలుమూరు, జూన్ 25(వార్త):** చల్లవానిపేట న్యూ కాలనీలో మురికి కాలువల నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నిలిచిపోయిన మురుగు నీటి కారణంగా దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమలు పెరిగి అనేక రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. కాలనీలోని మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం వల్ల నీరు బయటకు పొంగిపడి రహదారులపై చేరుతోందని వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్లపై సంచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలు కురిసే పరిస్థితుల్లో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. స్థానిక పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీ పరిశుభ్రతపై సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. సమస్య తీవ్రతపై పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకముందే కాలువలను పూర్తిగా శుభ్రపరచి, నిల్వ నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పరిశుభ్రత సమస్యను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



**జి.సిగడాం, జూన్25(వార్త):** పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని, ఆరోగ్యకరమైన సమాజానికి పునాదని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద అయెన31 గ్రామ పంచాయితీలకుస్వచ్ఛ రథాల ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొనసాగిస్తున్న స్వచ్ఛంద్రా- సోర్ణాంద్ర కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చునని గ్రామ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని చెత్త రోడ్డుపై, ఆరుబయట పడి వేయకుండా తడి, పొడి చెత్త వేర్వేరుగా గ్రీన్ అంబాసిడరలకు అందచేయాలన్నారు.పరిశుభ్రమైన పరిసరాలు మనకు మానసిక ప్రశాంతతను, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని పెర్కోన్నారు. పరిసరాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది కష్టం వెలకట్టలేనిదన్నారు.

పరిశుభ్రతతో పాటు పచ్చదనం కూడా ఎంతో అవసరమన్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఉన్నదన్నారు. చెట్లు మనకు ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రామకృష్ణారావు, డిప్యూటీ ఎంపీడీవో మురళీ, కూటమి మండల అధ్యక్షుడు కుమరాపు రవి కుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవి, ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకట రమణ, పీసీఎస్ అధ్యక్షులు నక్క మురళీ, టిడిపి సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, బీజేపీ రాష్ట్ర మోర్చా సభ్యులు వజ్జపర్తి రఘురాం, పడాల అప్పన్న, మక్క నారాయణరావు, డొల పార్వతీ, స్థానిక నాయకులు ముద్దాడ గౌరీ, సిరుగుడి గోవిందరావు, మజ్జి కన్నం నాయుడు, మజ్జిహరి, పంచాయితీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహు, స్థానిక సచివాలయ సిబ్బంది. పంచాయితీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం.. ముఖ్యమంత్రి సహాయ నిధి

### - ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**పలాస, జూన్ 25 (వార్త):** పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మొత్తం 9 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం రూ. 11,78,624 /- విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు పొందర రామలక్ష్మీ బెహరా- 61,884, కొల్లి కుమార్-1,11,21, తలగాపు వేణు-2,17,943,. బత్తిని రామారావు- 96,491, . కొండ రాములు-63,734, . బొడ్డు విజయ్ కుమార్-40,295,. బిజి జెస్సి-67,735, . మల్ల నిర్మల- 41,795, . గున్న దుర్గాప్రసాద్- ఎల్ ఓసి- 4,00,169లు మొత్తం 11,78,624 అందజేశామని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గౌతు శిరీషకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యసాధనకు కృషి



**మందస, జూన్ 25(వార్త):** స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యసాధన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజలు సహకరించాలని పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఏర్పాటు చేసిన పారిశుధ్య స్వచ్ఛ రథాలను(మూడు చక్రాల వాహనాలు) ఎంఎల్ఏ గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో ఈ స్వచ్ఛ రథాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించి తమ గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అన్నారు. పరిశుభ్రమైన గ్రామం-ఆరోగ్యవంతమైన సమాజం అనే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కూటమి ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, ఎంపీడీఓ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వచ్ఛత సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పోలేరమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ సీదిరి



**మందస, జూన్ 25(వార్త):** పోలేరమ్మతల్లి ఆలయ ప్రతిష్టలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మందస మండలం సాబకోట పంచాయతీ పరిధిలోని బుడంబోకాలనీ గ్రామంలో శ్రీపోలేరమ్మతల్లి ప్రతిష్ట మహోత్సవానికి అప్పలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గిరిజన సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం డాక్టర్ అప్పలరాజుకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, జిల్లా కార్యదర్శి అగ్నున సూర్యారావు, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, మందస మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావు, ఎస్టీ విభాగ అధ్యక్షుడు బిట్టుబాబు, నియోజకవర్గ పలాసటౌన్ అధ్యక్షుడు శిస్టు గోపి, సీనియర్ నాయకుడు గిన్ని తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలి రామారావు, మాజీ సర్పంచ్ సవర సంధ్యారాము, మాజీ సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ, సీనియర్ నాయకుడు గౌడు కురా తదితరులు పాల్గొన్నారు.

## దూకులపాడులో 'మనబడి-మన భవిష్యత్తు' పనుల పరిశీలన

**నరసన్నపేట, జూన్ 25 (వార్త):** దూకులపాడులో జరుగుతున్న 'మనబడి--మన భవిష్యత్తు' పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను మండల ఎస్ఎస్ఏ ఏఈ బేగం గురువారం పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న అదనపు భవన నిర్మాణ పనులను సందర్శించి నిర్మాణ సామగ్రి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎలాంటి రాజీ పడకుండా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పనుల వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అదనపు భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని ఆమె చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల ద్వారా విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



# ప్రయాణంలో శిరస్త్రాణం అతి ముఖ్యం

**-హెల్మెట్ మరవద్దు..**
**కుటుంబానికి దూరం కావద్దు**
**-సీఐ తిరుపతిరావు,**
**ఎస్ఐ కృష్ణప్రసాద్**




**మందస, జూన్ 25(వార్త):** ప్రయాణంలో శిరస్త్రాణం అతి ముఖ్యమని, హెల్మెట్ ధరించడం ఎట్టి పరిస్థితుల్లో మర వద్దని, కుటుంబానికి దూరం కావద్దని కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్.పి. కె.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు కాశీబుగ్గ రూరల్ సీఐ పి.తిరుపతిరావు ఆధ్వర్యంలో, మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ సమక్షంలో మందస పట్టణంలో అభయం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ మరువ వద్దని, ప్రమాదాలతో వారి కుటుంబాలకు దూరం కావద్దని హితవు పలికారు. ప్రయాణంలో ప్రమాదాలు జరిగే సందర్భాల్లో ప్రాణం కాపాడేది ఒక్క హెల్మెట్ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతీ వ్యక్తి ప్రయాణంలో హెల్మెట్ పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు లేక నిలువునా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ఉండటం వలన తల సురక్షితంగా ఉంటుందని తద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించబడతా రన్నారు. ప్రాణం ఖరీదు చాలా విలువైనదని గుర్తు చేశారు. నిర్లక్ష్య ప్రయాణాలు ద్వారా ప్రాణాలు కోల్పోయి ఆయా కుటుంబాలకు ఆసరా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు అండగా ఉండవలసిన వ్యక్తులు రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతుందని అన్నారు. చేతులారా ప్రాణాల్ని కోల్పోవడం అంటే మన నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. రోడ్లపై పోలీసులు పట్టించుకోవడం లేదన్న తేలిక భావనతో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వారికి, వారి కుటుంబాలకు తీవ్ర ప్రమాదకరమని హెచ్చరించారు.

### హరిపురంలో నషా ముక్త్ భారత్ అభియాన్

మందస మండలంలోని హరిపురంలో కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం సర్వనాశనమవుతుందన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరించారు. మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించి అమలులో ఉన్న చట్టాలు, వాటి ఉల్లంఘనపై తీసుకునే క్రమశిక్షణా చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాలకు బానిసలైతే వారి విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హితవు పలికారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. అనంతరం హరిపురం పురవీధుల్లో డ్రగ్స్ తో కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.

## ఓంకార్ మాస్టారు లేని లోటు తీర్చలేనిది



**పలాస, జూన్ 25 (వార్త):** ప్రజా ఉద్యమాలకు ఉద్దానానికి ఓంకార్ మాస్టారు లేని లోటు తీర్చలేనిదని పలువురు వక్తలు అన్నారు. గురువారం ఓంకార్ మాస్టారు రెండవ వర్ధంతి సభ మాకన్నపల్లిలో సూర్యోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టీ అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిపిఎం మండల నాయకులు యన్ గణపతి, స్థానిక సర్పంచ్ సైని దేశయ్య, గొల్లమాకన్నపల్లి సంఘం నాయకులు రాపాక చిన్నారావు, పెద్ద మాకన్నపల్లి సంఘం నాయకులు కుత్తుం ధర్మారావు, యు వి వి అధ్యక్షులు కోరాడ లింగమూర్తి, కార్యదర్శి ఎంపళ్ళ కామేశ్వరరావు, పి డి యం నాయకులు సాలిని వీరాస్వామి, ఓంకార్ మాస్టారు సోదరుడు బత్తిని ప్రసాదరావులు పాల్గొని మాట్లాడుతూ ఉద్దానంలో విద్యాభివృద్ధి కోసం, ఆరోగ్య పరిరక్షణ కోసం, మౌలిక సౌకర్యాలు కల్పన కోసం, అనేక పోరాటాలలో పాల్గొని విజయాలు సాధించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. సిపిఎం లో పని చేస్తూ దోపిడీ రహిత సమాజం రావాలని, జరిగిన కృషిలో తనవంతు కృషి చేశారని అన్నారు. ఈ రోజు ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు కారణంగా, సామాజికంగా వస్తున్న సమస్యలుపై ఐక్య పోరాటాలు సాగించి కార్పొరేట్ విధానాలు తిప్పి కొట్టడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సభలో గ్రామసంఘం నాయకులు తెప్పల రాజు సూర్యోదయ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి షణ్ముఖరావు, యస్ మురళి, టి మోహిని,జె కిషోర్ కె హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'లో అప్రమత్తంగా ఉండాలి



**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** కొలిగాం, పాయితారి, కీర్తిపురం పంచాయతీల పరిధిలో గల పోలింగ్ బూత్ లలో సర్ ప్రక్రియ పై బి ఎల్ ఏ లతో అందుబాటులో గల కార్యకర్తలు నాయకులతో నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, సమావేశం అయ్యి చర్చించారు. సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం వద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, డీసీఎంస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ఆశి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నీలాపు జగదీశ్,మాజీ జడ్పీటీసీ దక్కత నూకయ్య రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి ఆశి పురుషోత్తం రెడ్డి, మాజీ సర్పంచ్ లోపింటి దీనబంధు, లోపింటి మన్మధరావు, మాజీ సర్పంచ్ రాపక చంద్రయ్య, గందు మహాపాత్రో, బొబ్బిలి దేవరాజు, గానాల చిరంజీవి, ప్రకాష్ మహాపాత్రో, రొబి, ఉప్పిలి చంద్రయ్య, రాపక పకీరు, పలువురు వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి ఆలయానికి రూ.89,378 ఆదాయం



**పోలాకి, జూన్ 25(వార్త):** సుసరాంలో కొలువై ఉన్న శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయ హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించినట్లు దేవాదాయ శాఖ ఈవో సింగూరు నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ధర్మకర్త సరఫరా అప్పలసూరి ఆధ్వర్యంలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. గత 90 రోజుల వ్యవధికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా మొత్తం రూ.89,378లు సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా ఈ ఆదాయం లభించిందని, ఆలయ అభివృద్ధి మరియు నిర్వహణ కార్యక్రమాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పరిశుభ్రత, భద్రత, దర్శన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఆలయ పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఈ ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని, భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి




**పోలాకి, జూన్ 25(వార్త):** ద్విచక్ర వాహనదారులు తమ ప్రాణ భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలాకి ఎస్సై జి. రంజిత్ సూచించారు. గురువారం పోలాకి ప్రధాన రహదారిలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో 'అభయం' పేరుతో హెల్మెట్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హెల్మెట్ లేని వాహనదారులు ఈ బ్యాంక్‌లను సద్వినియోగం చేసుకుని రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఇటీవల కాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గుర్తుచేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించకూడదని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, కుటుంబాల భద్రత కోసం కూడా హెల్మెట్ ధారణను అలవాటు చేసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక వాహనదారులు పాల్గొన్నారు.

## సత్యవరం అగ్రహారంలో కామేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ

**నరసన్నపేట, జూన్ 25(వార్త):** సత్యవరం అగ్రహారంలోని శ్రీ ఉమా కామేశ్వరి సహిత కామేశ్వర స్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమైన మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రధాన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారి విగ్రహాలతో పాటు గణపతి, అమ్మవారి విగ్రహాలు, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. పునఃప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి దర్శనం కోసం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పునఃప్రతిష్ఠతో గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొందని, భక్తుల సహకారంతో మహోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మరిన్ని కార్యక్రమాలు రాబోయే రోజుల్లో కొనసాగనున్నట్లు తెలిపారు.



## ఎస్ఎస్ఎఫ్ఎస్‌లో అక్రమ ఫీజుల వసూళ్లపై..
# కఠిన చర్యలు తీసుకోవాలి




**పలాస, జూన్ 25 (వార్త):** పలాస ఎస్ఎఫ్ఎస్ విద్యాసంస్థలు విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు తదితర వస్తువులను కిట్ రూపంలో బలవంతంగా అందిస్తూ రూ.10,500 వరకు అధిక మొత్తాలను వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ కరువైందని విద్యార్థి సంఘాలు నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా పిడిఎసు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు నారాయణ, చైతన్య, భాష్యం, ఎస్ఎఫ్ఎస్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా అనుమతి లేకుండా విద్యాసంస్థలు నడుపుతూ ప్రభుత్వ నిబంధనలను ఐఐటి, నీట్ ఎంసెట్ ఫౌండేషన్, ఒలంపిడ్ కోర్స్ పేరుతో పేద విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యాహక్కు చట్టం--2009 రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటనలు కేవలం పేపర్ కే పరిమితం అయ్యాయని అన్నారు. విద్య సేవగా ఉండాలే గానీ వ్యాపారంగా మారకూడదని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి చలో కలెక్టరేట్ కి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం వ్యాపారం కాదు..
# ప్రజల ప్రాణాలు కాపాడే సేవ కావాలి

**- నిరుపేదలకు**
**ఆర్థిక వెసులుబాటు కల్పించాలి**
**- వెంకటకృష్ణ, నీలమణి దుర్గ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గౌతు శిరీష**
**- లేబర్ కాలనీలో**
**నూతన ఆసుపత్రి ప్రారంభం**

**పలాస, జూన్ 25 (వార్త):** "వైద్యం వ్యాపారం కాదు.. ప్రజల ప్రాణాలు కాపాడే సేవ కావాలి... ఉద్దానం అంటే రైతాంగం, జీడి కార్మికులు, మత్స్యకారులు, ఆదివాసీలు, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకంతో పాటు, వివిధ వాణిజ్య, వ్యాపార, పరిశ్రమల్లో పనిచేసే అసంఘటిత కార్మిక రంగం ఎక్కువగా ఉన్న ప్రాంతం ఇదేనని, ఈ నేపథ్యంలో ప్రజారోగ్యం విషయంలో వైద్యులను దేవుళ్ళుగా భావించే సమాజంలో, సామాజిక స్పృహతో కొంత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ, వైద్యులు వైద్య సేవ అందించాలని, ప్రస్తుత సమాజంలో కార్పొరేట్ సంస్కృతి వైద్య రంగంలో కూడా విస్తరిస్తోందని, ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సామాన్యులకు అందుబాటులో వైద్యం అవసరమని డాక్టర్ కూన మోహన్ బాబు, డాక్టర్ కూన పవన్ భాగస్వామ్యంతో పలాస ప్రాంత ప్రజానీకానికి మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలి" అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం లేబర్ కాలనీ ఏరియాలో నూతనంగా నిర్మించిన " వెంకటకృష్ణ, నీలమణి దుర్గ హాస్పిటల్" గురువారం ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ కూన మోహన బాబు, ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కూన పవన్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథిగా పలాస ఎమ్మెల్యే, ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, తాజా మాజీ పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పట్టణ ప్రముఖ వైద్యులు హాజరయ్యారు. ఉద్దాన ప్రాంతంలో పెరుగుతున్న ఆరోగ్య అవసరాల దృష్ట్యా లేబర్ కాలనీలో ఆసుపత్రి ఏర్పాటు చేయడం హర్షణీయమని, పేదలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు రవాణా సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఆమె నిర్వాహకులకు సూచించారు. అనంతరం డాక్టర్ కూన మోహన బాబు మాట్లాడుతూ లేబర్ కాలనీ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ హాస్పిటల్‌లో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ విభాగాలతో పాటు 24 గంటల అత్యవసర సేవలు, డయాగ్నస్టిక్ ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డాక్టర్ కూన పవన్ ఆర్థోపెడిక్ విభాగాన్ని పర్యవేక్షిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీల అధ్యక్షులు లోడగల కామేష్, పట్టణ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజు, పట్టణ టిడిపి కార్యదర్శి సప్ప నవీన్, వైయస్సార్సీపీ నాయకులు హనుమంతు వెంకట్రావు దొర, వల్లభ వైకుంఠ రావు, రోనంకి వెంకటరమణ, శాంతి కుమారి, మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు రోనంకి శ్రీనివాస్, నౌగాపు రాజారావు, పి. ప్రభాకర్ రావు, డబ్బిరు నాగు, ఆర్ఎంపీ వైద్యులు, సంఘ సేవకులు పాలవలస లక్ష్మణరావు, స్థానిక వార్డు ప్రజలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రూ.35లక్షలతో హరిపురంలో సెంటర్ డివైడర్




**మందస, జూన్ 25(వార్త):** హరిపురం అభివృద్ధికి కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే రూ.1.95కోట్లతో ఇండోర్ స్టేడియం ప్రాజెక్టు హరిపురానికి మంజూరైంది. ఈ తరుణంలో మరో అభివృద్ధి పథకం మంజూరైంది. నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న హరిపురంలో రూ.35లక్షలతో సెంటర్ డివైడర్ ను ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరయ్యాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి, ప్రమాదాలు నివారించడానికి సెంటర్ డివైడర్ ఎంతగానో ఉపయోగపడతాయి. స్థానికులు కలసికట్టుగా పలు అభివృద్ధి పనులను ఎంతో చక్కగా మంజూరు చేయించుకోగలుగుతున్నారు. ఐకమత్యంగా ఒక్కొక్కటిగా పలు పథకాలు, ప్రాజెక్టులను హరిపురం గ్రామస్థులు కృషి, పట్టుదల, అంకితభావంతో రాజకీయాలకు అతీతంగా సాధించుకుంటున్నారు. దీంతో మందస కన్నా.. హరిపురం ప్రాంతమే మంచి అభివృద్ధి పథాన పయనిస్తున్నట్టు భావిస్తున్నారు. వైద్య, విద్య, వాపారపరంగా మందస కన్నా హరిపురం పైచేయిగానే ఉంది. మందస మాత్రం కేవలం మండల కేంద్రంగానే గుర్తింపునకు మాత్రమే ఉపయోగపడుతోంది.

## వరిలో అధిక దిగుబడికి సూచనలు పాటించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 25 (వార్త):** బొడ్డకాళి, ఇన్నేసు పేట గ్రామాలలో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా. ఉదయభాను, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. కిరణ్, మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ పాల్గొని రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి పంటలో నూతన రకాలు, అధిక దిగుబడి సాధనకు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, పురుగు వ్యాధి నివారణ చర్యలు, ఉప్పు ప్రభావిత భూముల్లో సాగు చేయదగిన వరి రకాలపై శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఉప్పు ప్రభావిత ప్రాంతాల్లో సాగుకు అనువైన వరి మినీకిట్లను రైతులకు పంపిణీ చేసి, వాటి సాగు విధానం నిర్వహణ పద్ధతులపై సూచనలు అందించారు. అలాగే అధిక దిగుబడులు అందించే నూతన వరి రకాలను రైతులకు పరిచయం చేశారు. "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా మట్టి ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల వినియోగం, పంటల స్థిర ఉత్పాదకత పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటించి ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను అవలంబించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

**శ్రీకాకుళం**

## సమాచార సేకరణ కమిటీలతో జనసేన బలోపేతం

### -కమిటీ సభ్యుడు మజ్జి భాస్కరరావు

**మందస, జూన్ 25(వార్త):** జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, జనసైనికుల నుంచే భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలను ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు మజ్జి భాస్కరరావు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఏర్పాటు చేసిన 7మంది సభ్యుల కమిటీలో తనకు అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఒక సాధారణ జన సైనికుడిగా పార్టీ ఆవిర్భావం నుండి పనిచేస్తున్న తనలాంటి కార్యకర్తకు ఈ బాధ్యత అప్పగించడం జనసేన పార్టీలో కార్యకర్తలకు లభిస్తున్న గౌరవానికి నిదర్శనమన్నారు. కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తను గుర్తించి, వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించాలనే పవన్ కళ్యాణ్ దూరదృష్టికి ఈ కమిటీలు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన జనసైనికులు, వీర మహిళలు, సాధక్స్, నాయకుల వివరాలను సేకరించి, వారి సేవలు, అనుభవం, నాయకత్వ సామర్థ్యం, ప్రజా సేవా దృక్పథం వంటి అంశాలను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లడమే ఈ కమిటీల ప్రధాన ఉద్దేశమన్నారు. 2014 నుండి జనసేన జెండాను మోస్తూ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వారికి తగిన బాధ్యతలు అప్పగించేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన వారికి జనసేనలో సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో ఈ ప్రక్రియ కొనసాగుతోంద న్నారు. జనసేన కార్యకర్తలు కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై స్పందిస్తూ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ, సభ్యత్వ నమోదులో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజలతో నిరంతరం మమేకమై తమ నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. నేటి జనసైనికులే రేపటి నాయకులనే భావనతో ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. త్వరలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల ఏర్పాటు ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో పార్టీ కోసం పనిచేయాలనే ఆసక్తి ఉన్న జనసైనికులు, వీర మహిళలు తమ బయోడేటా, పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల వివరాలను కమిటీ సభ్యులకు అందించాలని కోరారు. ఈ వివరాలన్నీ పార్టీ నాయకత్వ పరిశీలనకు వెళ్లి, అర్హత పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు. జనసేనలో పదవులు వారసత్వంగా రావు... కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు వస్తాయని, జన సైనికుడి నుండి నాయకుడిగా ఎదిగే అవకాశాన్ని కల్పించే రాజకీయ వేదిక జనసేన పార్టీ మాత్రమేనని మజ్జి భాస్కరరావు పేర్కొన్నారు.



## సేఫ్టీ ఫస్ట్-హెల్మెట్ మస్ట్



**పలాస, జూన్ 25 (వార్త):** సేఫ్టీ ఫస్ట్--హెల్మెట్ మస్ట్ అని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి అన్నారు. గురువారం రాత్రి పురుషోత్తపురం గ్రామాన్ని సందర్శించి అభయం హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. "చిన్న దూరమే కదా" అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యతని తెలియజేశారు. యువత రోడ్డు భద్రత విషయంలో ఆదర్శంగా నిలిచి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, యువత హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. సందర్భంగా ప్రజలచే హెల్మెట్ ధరించండి -- ప్రాణాలను రక్షించుకోండని, సేఫ్టీ ఫస్ట్ హెల్మెట్ మస్ట్, హెల్మెట్ మీ కుటుంబానికి భరోసని, అతివేగం ప్రమాదానికి దారి -- జాగ్రత్తే రక్షణనని, రోడ్డు భద్రత అందరి బాధ్యతని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి




**నరసన్నపేట, జూన్ 25(వార్త):** డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత, ముఖ్యంగా విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలని నరసన్నపేట సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్సై బి. గణేశ్ పిలుపునిచ్చారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దాడ లత ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువతలో పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కొందరు విద్యార్థులు గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు విద్య, భవిష్యత్, కుటుంబ జీవితం కూడా ప్రమాదంలో పడుతుందని వివరించారు. తప్పుడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు తమ చదువులపై దృష్టి సారించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సీఐ, ఎస్సై సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యాంలు

### - మరమ్మతులు లేక వర్షాకాలంలో పొలాల్లోకి వరదనీరు

### - ప్రతిపాదనలు సిద్ధం చేశామని నోడల్ అధికారి తిలక్ వెల్లడి

**సారవకోట, జూన్ 25 (వార్త):** సారవకోట మండలంలో 2006-07లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పలు చెక్‌డ్యాంలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఒక్కో చెక్‌డ్యాం నిర్మాణానికి సుమారు రూ.60 వేలు కేటాయించి నిర్మించిన ఈ పనులు, సరైన నిర్వహణ లేకపోవడంతో కాలక్రమేణా దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ చెక్‌డ్యాంలు వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ భూములకు రక్షణ కల్పించాల్సి ఉండగా, ప్రస్తుతం అవి పనికిరాని స్థితికి చేరాయని రైతులు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాకాలంలో వరద నీరు నేరుగా పొలాల్లోకి చేరి పంటలకు నష్టం కలిగిస్తోందని తెలిపారు. చెక్‌డ్యాంలు పాడవ్వడం వల్ల నీటి నియంత్రణ లోపించి వ్యవసాయ భూములు ముంపుకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ప్రతి వర్షాకాలంలో నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. పంటలను కాపాడాలంటే చెక్‌డ్యాంలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సమస్యపై నోడల్ అధికారి తిలక్ స్పందిస్తూ, శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యాంల మరమ్మతుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అవసరమైన నిధుల మంజూరుతో దశలవారీగా పునరుద్ధరణ పనులు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని చెక్‌డ్యాంలను బలోపేతం చేస్తేనే రైతులకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





## వంశధార కాలువ పనులు వేగవంతం

### - ఖరీఫ్ సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

### - నిధుల మంజూరుతో పూడికతీత పనుల పర్యవేక్షణ

**నరసన్నపేట, జూన్ 25(వార్త):** వంశధార కాలువల అభివృద్ధి పనులకు ఇటీవల ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులను వేగవంతంగా చేపడుతున్నామని వంశధార డీఈ రామలక్ష్మి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం నరసన్నపేట, జలుమూరు మండలాల పరిధిలో కొనసాగుతున్న కాలువల పనులను డీఈ రామలక్ష్మి, ఏఈ సిల్లా హరీశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కాలువలలో పూడికతీత, మరమ్మతుల పనుల పురోగతిని సమీక్షించారు. కాలువల ద్వారా సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా పూడికలను తొలగిస్తున్నామని, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతున్నామని డీఈ తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. సాగునీటి కాలువల పరిరక్షణలో రైతుల సహకారం కూడా అవసరమని, కాలువల వెంట ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని రైతులను కోరారు. వ్యవసాయ అవసరాలకు తగిన విధంగా నీటి సరఫరా అందించేందుకు శాఖ తరఫున సమన్వయంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కాలువల పనులు పూర్తయితే ఖరీఫ్ సాగుకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, నీటి పంపిణీ మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శరవేగంగా సారవకోట
## తహశీల్దార్ కార్యాలయ పనులు

### - మూడు నెలల క్రితం పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

### -మరికొద్ది నెలల్లో భవనం పూర్తిచేసి శాఖకు అప్పగించే దిశగా చర్యలు

**సారవకోట, జూన్ 25(వార్త):** సారవకోటలో నిర్మాణంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయ భవన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మూడు నెలల క్రితం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుని ప్రస్తుతం మరింత పురోగతితో ముందుకు సాగుతోంది. ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఆధునిక వసతులతో తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు సమాచారం. ప్రారంభ దశ నుంచి ఇప్పటివరకు పనులు నిరంతరంగా కొనసాగుతూ ప్రస్తుతం నిర్మాణం కీలక దశకు చేరుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భవనం నిర్మాణం పూర్తయితే రెవెన్యూ సేవలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని అభిప్రాయపడుతున్నారు. నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతుండగా, మరికొద్ది నెలల్లో భవనాన్ని పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించేందుకు గుత్తేదారుడు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కార్యాలయ నిర్మాణం పూర్తయితే సారవకోట మండల ప్రజలకు రెవెన్యూ సేవల విషయంలో మెరుగైన సౌకర్యాలు కలగనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ప్రజలకు అవసరమైన సేవలను ఒకేచోట అందించేలా చర్యలు తీసుకుంటోందని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. తహశీల్దార్ కార్యాలయ భవనం త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

### - విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా..

### -నాణ్యమైన బోధనపై దృష్టి పెట్టాలని సూచన

### - ఎఫ్ఎల్ఎన్ శిక్షకు అనుగుణంగా బోధన

### - మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశం



**నరసన్నపేట, జూన్ 25(వార్త):** గొట్టిపల్లి పంచాయతీ రెడ్డిపేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి బోధన విధానంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ ముందుగా విద్యార్థులతో మమేకమై వారి పాఠ్య అవగాహన, ప్రాథమిక నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు పొందిన శిక్షణను తరగతి గదిలో సమర్థంగా వినియోగించి పిల్లలకు బోధన అందించాలని అన్నారు. విద్యార్థుల్లో పఠన, లేఖన, గణన నైపుణ్యాలు పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా బోధన కొనసాగించాలని, ప్రతి విద్యార్థి పురోగతిపై ఉపాధ్యాయులు పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## డ్రగ్స్ జోలికి వెళితే భవిష్యత్ అంధకారం




**సోంపేట, జూన్ 24(వార్త):** విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని, ఈ దశలో ప్రమాదకరమైన డ్రగ్స్ కు అలవాటు పడితే జీవితాంతం వాటిని విడిచిపెట్టలేరని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కోడూరి కిషోర్ బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల కాలంలో డ్రగ్స్ వాడకం యువతలో పెరుగుతోందని ఇది సమాజానికి చాలా ప్రమాదకరమని అన్నారు. ప్రతి వ్యక్తి అందంగా,ఆరోగ్యంగా జీవితం గడపాలని ఆకాంక్షించారు. అటువంటి జీవితానికి ఉత్తమమైన చదువే మూలమని అన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని హితవు పలికారు. దీనివల్ల కఠిన శిక్షలకు గురవుతారని పేర్కొన్నారు.

### లోక్ అదాలత్ విజయవంతం చేయండి:

జూలై 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కోడూరి కిషోర్ బాబు స్థానిక పోలీస్ అధికారులను కోరారు. వారితో ప్రత్యేకంగా సమావేశమై పోలీస్ స్టేషన్లో పెండింగ్ కేసులను పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేందుకు ఆయా పార్టీలను అంగీకరింపజేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కునితి వెంకటేశ్వరరావు, జీఎస్ శైలేంద్ర, మద్దు సర్వేశ్వరరావు, డీ జగన్ నాయకులు,విజయ్ కుమార్, ఉషారాణి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జివి రమణ,కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజం లక్ష్యం

**పలాస, జూన్ 25 (వార్త):** మాదకద్రవ్యాల రహిత సమాజం లక్ష్యమని కాశీబుగ్గ డి.ఎస్.పి టి భవాని అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కాశీబుగ్గ డీఎస్పీ టి భవాని కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్యతేజా కళాశాల, వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ టి భవాని మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మత్తుకు దూరంగా ఉండండి -- ఆరోగ్యకరమైన, సురక్షితమైన భారత నిర్మాణానికి సహకరించండి అని విద్యార్థులకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ వై రామకృష్ణ, ఎస్ఐలు ఆర్ నరసింహమూర్తి, సునీలు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546